# తాత క్లీన బౌల్డ్!

-భమిడిపాటి సోమయాజి

నాకు ఇద్దరు కొడుకులు. పెద్దవాడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండోవాడు మన దేశంలోనే ఉన్నా, ఇతర దేశాల్లో ఉన్నట్టే! ప్రైవేట్ కంపెనీలో పెద్ద ఉద్యోగం! నేనున్నచోటికి అస్తమానూ రాలేడు. ఉద్యోగరీత్యా ఉండే పెద్ద బాధ్యతలు నిర్వర్తించే వారు ఇతర బాధ్యతలు నిర్వర్తించడం కష్టం!

నా రెండో కొడుక్కి ఒక పిల్లాడు! ఎక్కువమంది మనవలు లేరన్న బాధ లేకుండా, పదిమంది చేసే అల్లరి వాడొక్కడే చెయ్యిగల ధీమంతుడు. వీళ్లు ఒకసారి వచ్చివెడితే గాలివాన వచ్చి వెలిసినంత ప్రశాంతమైపోతుంది ఇల్లు. కారణం ఆబాల ధీమంతుడే! ఉన్న ఆటవస్తువులు చాలవన్నట్లు వచ్చినప్పుడల్లా ఒక క్రికెట్ బ్యాట్ కొనమంటాడు వాడు. వాడికి అయిదేళ్లు! క్రికెట్ బ్యాటంత ఉంటాడు.

అహ్మదాబాద్ నుంచి ఈ సంక్రాంతికి సకుటుంబంగా వస్తున్నట్లు ఉత్తరం రాశాడు నా రెండో కొడుకు. ఆ ఉత్తరం వచ్చినది మొదలు, నా గృహలక్ష్మి "ఈసారైనా మనవడికి బ్యాట్ కొనివ్వండి. మళ్లీ హైదరాబాద్ ఎప్పుడు వస్తారో ఏమో!" అంటూ వీరబాదుడు మొదలు పెట్టింది. నాకూ వాడికి బ్యాట్ కొనాలనే వుంది. పెన్షన్‌లో ఎన్నని చెయ్యగలం. అయినా ఈసారి బ్యాట్ కొని ఇవ్వడానికే నిర్ణయించాను.

నా నిర్ణయం తెలుసుకున్నా, ఫైనాన్స్ విషయం తెలియని, నా హోమ్ మినిస్టర్, తన మాట వినడం వలన ఇంట్లో లా అండ్ ఆర్డర్ దెబ్బతిన్నందుకు సంతోషించింది. ఒకరోజు బ్యాట్ ఖరీదు విచారించాను. మూడు వందలు చెప్పాడు. నా దగ్గర ఒక ఏభై తక్కువ ఉన్నందుకు విచారించాను. మా చిన్నతనంలో గోటీబిళ్ల ఆడుకునే వాళ్లం. అసలు పెద్దవాళ్లు డబ్బులిచ్చే వారే కాదు. సరే! అబ్బాయి వచ్చిన తర్వాత కొనచ్చులేనని ఊరుకున్నాను.

***

మా మనవడు వస్తూనే "తాతా! బ్యాట్ కొన్నావా!" అన్నాడు. మా అబ్బాయిని పక్కకి పిలిచి "నా దగ్గర రెండు వందల ఏభై ఉన్నాయి. ఫలానా షాప్‌లో ఒక బ్యాట్ మూడొందలు చెప్పాడు. అది కొని పట్రా! నువు వెళ్లే లోపులో మిగిలిన ఏభై కూడా ఇస్తాను." అని ఆ బ్యాట్ పని వాడికి పురమాయించాను. సాయంకాలం సతీసమేతంగా వెళ్లి ఆ బ్యాట్ తెచ్చాడు మా వాడు.

"రా తాతా! బౌలింగ్ చెయ్యి!" అంటూ నన్ను పిలిచాడు మనవడు. ఆ రోజు కాసేపు ఆడాం.

మర్నాడు భోగి పండుగ. మధ్యాహ్నం భోజనాలైన తర్వాత "రా తాతా! మళ్లీ ఆడదాం!" అన్నాడు మనవడు.

"ఇప్పుడు కాదు సాయంకాలం చల్లగా ఉన్నప్పుడు ఆడదాం!" అన్నాను నేను.

"నీకేం తెలీదు క్రికెట్ ఎండలోనే ఆడతారు."

"అవునురా మీ తాతకేం తెలీదు. మా పెళ్లయిన తర్వాత కానీ ఈ విషయం నాకు తెలియలేదు. లేకపోతే అసలు మీ తాతని పెళ్లి చేసుకోపోదును" అంది బామ్మగారు.

"అవును నాకేం తెలీదు. నువ్వు తెలివైనదానివనీ నన్ను కాపాడతావనీ నాకు నిన్ను కట్టపెట్టారు మా పెద్దలు" అన్నాను ధైర్యం తెచ్చుకున్న నేను.

"మీ పోరు వలన అసలు బ్యాట్ కనపడడం లేదు" అన్నాడు మనవడు.

ఇంట్లో వెతికాం. కనపడలేదు. బయట కొబ్బరి చెట్టుల మొగలో కనపడింది.

"అప్పుడే ఆ బ్యాట్ అలా పాతదైపోయిందేమిటి! మీ నాన్న అన్నీ చౌకబారు వస్తువులే కొంటారు" అంది కోడలు.

ఆ బ్యాట్ నేనే కొన్నానని చెప్పలేకపోయాను. చౌకబారు బ్యాట్ అంటూంటే, అది నేనే కొన్నానంటే నామర్దా కదూ! పైగా ఇంకా మిగిలిన ఏభై రూపాయలూ మా అబ్బాయికి ఇవ్వనే లేదు. మౌనమే భూషణమయింది నాకు. సరే! మళ్లీ కాసేపు ఆట సాగించాం. సంక్రాంతి రోజు మా వాడూ, కోడలూ, మనవడ్ని ఇంట్లో వదిలేసి బయటకి వెళ్లారు. అప్పుడు మా ఆవిడ అంది.

"మిమ్మల్ని బ్యాట్ కొనమంటే కొనలేదు. అబ్బాయి కొన్న బ్యాట్ చౌకబారుది అంది కోడలు. మీరే ఒక ఖరీదైన బ్యాట్ కొనిస్తే బాగుండేది." అసలు ఆ బ్యాట్ ఖరీదు అంతా ఇవ్వలేకపోయాననని నేను బాధపడుతూంటే, అంతకంటే మంచి ఖరీదైన బ్యాట్ అంటుందేమిటి? అది నేనే కొన్నానంటే ఇంకా సాధిస్తుందని, మళ్లీ మౌనం వహించాను. "మౌనమె నీ భాష ఓ మూగ మనసా!" అన్న పాట గుర్తొచ్చింది.

అయినా, మా కోడలు కనకమహాలక్ష్మి ఎంత ఖరీదైన వస్తువులనైనా చౌకబారు అంటుంది. మరి మా అబ్బాయి సంపాదన అటువంటిది. వాడి సాలుసరి ఇంక్రిమెంట్ అయిదు వేలైనా ఉంటుంది. నాకైతే ఆ అయిదు వేలు జీతం పెరగడానికి కనీసం ఎనిమిది సంవత్సరాలు పట్టేది. అందుకే నాకు అన్ని వస్తువులూ ప్రియంగా కనిపిస్తాయి. ఏమిటో నా జీవితం! నేను కొనిచ్చిన బ్యాట్, నేనే కొన్నానని చెప్పుకోలేని దుస్థితి.

ఆ రోజే వాళ్ల ప్రయాణం. ఇక వాళ్లు బయల్దేరతారనగా మళ్లీ బ్యాట్ కనపడలేదు. "మొన్ననే కొన్నాం వెధవా! అప్పుడే అది పారేశావ్!" అని వాడ్ని కొట్టింది కోడలు.

"కొన్నది మీరు కాదు. నేనే కొన్నానని" అప్పుడు కూడా చెప్పలేకపోయాను.

మా కోడలు ఆ బ్యాట్ కోసం వెతుకుతూనే ఉంది. "మేం చూసి జాగ్రత్త పెడతాంలే! ఈసారొచ్చినప్పుడు వాడు ఆడుకుంటాడు" అంది నా శ్రీమతి.

"అది అహ్మదాబాద్ తీసుకెడదామని" అంది కోడలు.

"ఏమిటో ఈ మనుషులు! వస్తువులు చౌకబారు అంటూనే ఎంత దూరమైనా మోసుకుపోతారు" అనుకున్నాను.

మా అబ్బాయి తన తల్లిని వంటింట్లోకి తీసుకెళ్లి ఏదో చెపుతున్నాడు. నా భార్య నన్ను పక్కకి పిలిచి "ఆ బ్యాట్ కొన్నానని చెప్పడానికి అంత మొహమాటం ఎందుకు? మొన్న మా అన్నయ్య చీర కొనుక్కోమని ఇచ్చిన అయిదు వందల్లో ఒక ఏభై అబ్బాయికి ఇచ్చేశాను" అంది.

వాళ్ల ప్రయాణం హడావిడిలో ఉన్నారు. ఇంకో గంటలో స్టేషన్‌కి బయల్దేరతారు.

బ్యాట్ కోసం వెదికాను. చెట్ల మధ్యలో కనబడింది. అది తీసుకుని మనవడికి ఇచ్చాను.

"తాతా! క్రికెట్ ఆడదాం!" అన్నాడు మనవడు.

ఆట మొదలయింది. వాడు బ్యాటింగ్ చేస్తూంటే, ఆ బ్యాట్ హేండిల్ పోయింది. దానికి మేకులు కొట్టి బాగు చేశాను. లోపల్నుంచి వచ్చిన కోడలు "అందుకే దీన్ని చౌకబారు అన్నాను" అంది. నా పెన్షన్ డబ్బులోంచి కష్టపడి కొన్న

బ్యాట్‌ని, 'చౌకబారు' అని పదే పదే అనడం సహించలేకపోయాను. మనసులోని బాధతో 'దొంగలు దొంగల్ని గుర్తుపట్టినట్లు, నువ్వు చౌకబారు దానివి కనుక ఆ బ్యాట్ చౌకబారుది అని తెలుసుకోగలిగావు' అనుకున్నాను అక్కసుతో.

మధ్యలో వాళ్ల నాన్నని బ్యాటింగ్ చెయ్యమన్నాడు మనవడు. అక్కడే ఉన్న మా కోడలు "మీరు ఆ బ్యాట్‌తో ఆడొద్దు. మీకు క్రికెట్లో చాలా బహుమతులు వచ్చాయి కదా. ఆ బ్యాట్ నాసిరకంది." అంది. "గట్టిగా అరవకు ఆ బ్యాట్ మా నాన్నగారు కొనిచ్చినది" అన్నాడు మా అబ్బాయి.

"అలా చెప్పండి! అందుకే అలా నాసిరకంగా ఉంది" అంది కోడలు.

"నేనే కొన్నానని తెలుసుకుని కూడా ఆ బ్యాట్‌ని నాసిరకం!" అంటోంది అని బాధ పడ్డాను.

"నువ్వు బ్యాటింగ్ చెయి తాతా!" అన్నాడు మనవడు. క్రికెట్లో బహుమతులు రాని నేను బ్యాటింగ్ మొదలుపెట్టాను. మనవడు వేసిన బంతి స్పీడుగా వచ్చి స్టంప్స్‌కి తగిలింది స్టంప్ పడిపోయింది. అంతే !

"తాత క్లీన్ బౌల్డ్" అని అరిచాడు వాడు. ఇంట్లో వాళ్లంతా చప్పట్లు కొట్టారు. ఆ సంసార సాగరంలో పయనించే నా ఓడకీ, ఈ క్రికెట్ ఆటకీ నేనే కదా కెప్టెన్‌ని. వాళ్లు చప్పట్లు కొట్టడం సమంజసమే.

వాళ్లు ప్రయాణం అయి వెళుతూండగా, "ఈసారి నిన్ను క్లీన్ బౌల్డ్ చేసి వెళుతున్నాం, తాతా!"' అన్నాడు మనవడు. కోడలు రాచరికపు ఠీవి అంతా వాడికి వచ్చినందుకు సంతోషించాను. మగపిల్లాడు తల్లి పోలికయితే అదృష్టవంతుడంటారు కదా! భోగి, సంక్రాంతి, కనుమ పండుగలైపోయినా కానీ 'ఈ బ్యాట్ చౌకబారుది' అన్న మాటలు మాత్రం నా చెవులో మారుమోగుతూనే ఉన్నాయి. అందుకే ఈ ముక్కనుమనాడు కూడా, నా మనస్సులో భోగిమంటలు మండుతూనే ఉన్నాయి.

★

